తీరని యూరియా కష్టాలు

- ప్రభుత్వ నిర్లక్ష్యంపై రైతుల ఆందోళన
- గంటల తరబడి క్యూలో నిరీక్షణ



రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

అచ్యుతాపురం రూరల్ : మండల రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. యూరియా కోసం మండల వ్యవసాయ కార్యాలయం వద్ద, సచివాలయాల గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి రైతులు వ్యవసాయ కార్యాలయం వద్ద బారులు తీరి, నిరీక్షించి స్లిప్పులు పొంది ఎరువులు తీసుకోవలసిన పరిస్థితి నెలకొంది.గతంలో ఆధార్ కార్డు ఉంటే యూరియా అందించే వారు. ఇప్పుడు భూమి పట్టాదారు పాసు పుస్తకం నకళ్లుగాని, భూమి వివరాలు గాని తెలియజేస్తేనే ఇస్తున్నారు. మండలంలో 1800 హెక్టార్లలో వరి, 550 హెక్టార్లలో చెరకు, 250 హెక్టార్లలో గంట్లు, సజ్జలు వంటి చిరు ధాన్యాలు సాగవుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో 600 టన్నుల యూరియా అవసరం కాగా.. 482 టన్నులు వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు.

గంటల కొద్దీ ఎదురుచూపు



గతంలో ఒక బస్తా యూరియా ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ వేయడానికి యూరియా కోసం మూడు గంటలు పైగా కాపలా కాసి నిరీక్షించాల్సిన పరిస్థితి. దీనివల్ల ఖర్చులు, కాలం వృథా. తమ కష్టాలు తీరడానికి ఎక్కడికక్కడే రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కర్రి అప్పారావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

యూరియా ఉంటుందో? లేదో?



వరి సాగు చేస్తున్నాను. యూరియా లేక గతంలో డీఏపీ వేయాల్సి వచ్చింది. ఆధార్ కార్డు ఉంటే గతంలో యూరియా ఇచ్చే వారు. ఇప్పుడు పట్టాదారు పాసు పుస్తకం కావాలంటున్నారు. దాన్ని తెచ్చేలోగా యూరియా నిల్వ ఉంటుందో? లేదో? దిగులుగా ఉంది.

– కూండ్రపు శ్రీరాములు, రైతు

90 శాతం పంపిణీ చేసేశాం..



ఇప్పటికే 90 శాతం యూరియా పంపిణీ చేసేశాం. మరో పది శాతం వచ్చే రబీ సీజన్‌లో అందజేస్తాం. రైతులకు ఎప్పటికప్పుడు వ్యవసాయం పరంగా అన్ని విధాలా సలహాలు, సూచనలు తెలియజేస్తున్నాం.

– శంకర్ గోవింద్, మండల వ్యవసాయాధికారి, అచ్యుతాపురం

క్లుప్తంగా

పెదపల్లిలో ఉద్రిక్తత



కాలువపై వేసిన రహదారిని తొలగించాలని పోలీసులను డిమాండ్ చేస్తున్న యువకులు

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధి పెదపల్లిలో ఓ భూమికి సంబంధించిన వివాదంతో శుక్రవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొందరు యువకులు తమ గ్రామానికి ఆనుకుని ఉన్న కొంత భూమి చెరువుగా పూర్వపు రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉండేదని, నిషేధిత జాబితాలో ఉన్న ఆ భూమిని ఇటీవల అధికారులు ఒకరి పేరున రాసిచ్చారని ఆరోపించారు. ఆ భూమిలోకి వెళ్లడానికి శేషుగెడ్డ నుంచి నీరు ప్రవహించే కాలువను కప్పి తన భూమిలోనికి ఒక వ్యక్తి దారి ఏర్పాటు చేసుకున్నారని, నిబంధనలకు విరుద్ధంగా సాగునీటి కాల్వను కప్పి రహదారి వేసుకోవడమేమిటని యువకులు ప్రశ్నించారు. గెడ్డనీరు ప్రవహించే కాల్వలో వేసిన రహదారిని తొలగించాలని వారంతా డిమాండ్ చేశారు. అక్కడున్న జేసీబీ డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగిన యువకులు, గెడ్డ కాల్వను పూడ్చి వేసిన రహదారిని తొలగించాలని పట్టుబట్టారు. సమాచారం అందుకున్న ఇద్దరు యలమంచిలి రూరల్ పోలీసులు మఫ్టీలో అక్కడకు వచ్చి యువకులను వారించే ప్రయత్నం చేశారు. అయినా యువకులు ససేమిరా అనడంతో యలమంచిలి రూరల్ ఎస్సై ఎం.ఉపేంద్ర, సిబ్బందితో పెదపల్లి చేరుకుని యువకులకు నచ్చజెప్పడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

కోటవురట్ల: పారిశుధ్య మెరుగుకు దోహదపడాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. ఐవీఆర్ఎస్ గ్రామం యండపల్లిలో శుక్రవారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షించి, ఇంటింటికి వెళ్లి పారిశుధ్య సమస్యలపై ఆరా తీశారు. వీధుల్లో పారిశుధ్య అంశాలు పరిశీలించి స్థానికులు, పారిశుధ్య కార్మికులకు సూచనలు చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామాల కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా పోగు చేసి కార్మికులకు అందజేయాలని సూచించారు. వీధుల్లో చెత్తను ఇష్టానుసారంగా వేయకుండా నిర్దేశించిన స్థలంలో మాత్రమే వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రవికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు సీజేఐపై దాడి అనాగరికం



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎస్.రాయవరం: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై వెంటనే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ రమేష్‌బాబుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 7న సుప్రీంకోర్టులో బెంచ్‌పై వాదన వింటున్న ప్రధాన న్యాయమూర్తి పై రాజేష్‌కిషోర్ అనే వ్యక్తి దాడికి పాల్పడ్డారని గుర్తు చేశారు. ఈ దాడి అనాగరికమని, ప్రజాస్వామ్యం స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలోఎమ్మార్పీస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంపల రాజు, గౌరవ అధ్యక్షుడు సుబ్బారావు, మండల అధ్యక్షుడు కాపారపు ఆకాష్, ఎస్.రాయవరం మండల టౌన్ అధ్యక్షుడు కోరిబిల్లి లోవరాజు, ఓదూరి ఏసుబాబు శంకరరావు, మిరియాల ఆశీర్వాదం, నల్లమాటి పోతయ్య, తదితరులు పాల్గొన్నారు.

హరిపాలెం పీహెచ్‌సీ తనిఖీ



కొండకర్లలో నీటి నిల్వ ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మలేరియా అధికారి

అచ్యుతాపురం: మండలంలోని హరిపాలెం పీహెచ్‌సీని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి ఏజే సత్యనారాయణ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ల్యాబ్‌లో జరుగుతున్న పరీక్షల గురించి టెక్నికల్ అసిస్టెంట్ వద్ద ఆరా తీశారు. అనంతరం కొండకర్లలో డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్న తీరుని పరిశీలించారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, నాయుడు, రామలక్ష్మి, సునీత, ఉమామహేశ్, సుజాత, శ్రీదేవి పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ పంపిణీ

అచ్యుతాపురం: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ మెటీరియల్‌ను శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు రచించిన ఎన్ఎంఎంఎస్ పుస్తకాన్ని విద్యార్థులకు అందజేశారు. మారిసెట్టి వెంకట అప్పారావు, ఉప్పాడ రాము, ఎం.పద్మావతి, కల్పన, మారిశెట్టి కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయ వనరులపై దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

పాయకరావుపేట: పంచాయతీలకు ఆదాయ వనరులపై సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎంపీడీవో పి.విజయలక్ష్మి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్‌లు, కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీలకు సమకూరే ఆదాయ మార్గాలైన ఇంటి పన్నులు, కుళాయిల రుసుం, వేలం పాటలు, సంతల ఆశీలు వసూలు, లైసెన్స్ ఫీజులు, ప్రకటన పన్నులు, షాపుల అనుమతి, లేఅవుట్లపైన వచ్చే ఆదాయం, ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లపైన దృష్టి సారించి గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఈవోఆర్‌డీ డేవిడ్ ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

మునగపాక: క్రీడాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శరీర ధారుడ్యం పెరుగుతుందన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు, పలు పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసంకు సన్మానం



వీసంను అభినందిస్తున్న పార్టీ నాయకులు

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణను శుక్రవారం పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు ఘనంగా సన్మానించారు. నక్కపల్లిలోని పార్టీ కార్యాలయం వద్ద సీనియర్ నేతలు అయినంపూడి మణిరాజు, పొడగట్ల పాపారావుల ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర నాయకులు ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా మణిరాజు, పాపారావు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సూరాకాసుల గోవిందు, గొర్ల గోవిందు తదితరులు మాట్లాడుతూ మండలంలో ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులతో పాటు మెజార్టీ ఎంపీటీసీ, సర్పంచ్ పదవులను గెలిపించడంలో వీసం కీలక భూమిక పోషించారని కొనియాడారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్‌లు పి.వెంకటేష్, వెదుళ్ల రమణ, ఎంపీటీసీ తిరుపతిరావు, నాయకులు కొప్పిశెట్టి హరి, తళ్ల భార్గవ్, కొల్నాటి బుజ్జి, సూరిబాబు, అప్పలరాజు, పిక్కి తాతీలు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలపై త్వరలో రచ్చబండ

- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజలకు అవగాహన
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం

నక్కపల్లి: కూటమి ప్రభుత్వ వైఫల్యాలలపై త్వరలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించనున్నామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన నక్కపల్లిలో సీనియర్ నాయకులు మణిరాజు, పాపారావు, ఈశ్వరరావులతో కలసి విలేకర్లతో మాట్లాడారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై గ్రామాల్లో విద్యార్థులు, యువతకు అవగాహన కల్పిస్తామన్నారు. అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తవుతోందని, కొత్తగా ఒక్క పింఛను గాని, ఇల్లు గాని మంజూరు చేయలేదన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను తొలి ఏడాది ఎగ్గొట్టేశారన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలుపై నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు ఆధ్వర్యంలో జరిగే రచ్చబండను విజయవంతం చేయాలని కార్యకర్తలను కోరారు.

రాజయ్యపేట వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుల అడ్డగింత



డీఎస్పీ శ్రావణితో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలంటూ రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులను శుక్రవారం పోలీసులు అడ్డుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు రాజయ్యపేట వెళ్తుండగా నక్కపల్లిలో ఉపమాక రోడ్ ఆర్చి వద్ద సీఐ ప్రేమ్‌కుమార్, తదితరులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు వైఎస్సార్‌సీపీ నేతల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న అనకాపల్లి డీఎస్పీ శ్రావణి వచ్చి వైఎస్సార్‌సీపీ నాయకులతో చర్చించారు. పార్టీ తరపున సంఘీభావం తెలిపి వెంటనే వచ్చేస్తామని నాయకులు తెలిపారు. ఎటువంటి వివాదాస్పద వ్యాఖ్యలు గాని, ఆందోళనలు చేయబోమన్నారు. దీనిపై డీఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం రాజయ్యపేటలో సెక్షన్ 30 అమల్లో ఉందని, ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటు చేసకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పరిస్థితులు చక్కపడే వరకు పోలీసులకు సహకరించాలని కోరారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, ఎంపీటీసీలు తోట సత్తిబాబు, గంటా తిరుపతిరావు, గొర్ల గోవిందరావు, పక్కుర్తి రమణ, కొల్నాటి బుజ్జి, సర్పంచ్‌లు పొడగట్ల వెంకటేష్, వెదుళ్ల రమణ, సీనియర్ నాయకులు సూరాకాసుల గోవిందు, కొప్పిశెట్టి హరిబాబు, తళ్ల భార్గవ్, పిక్కి తాతీలు, ఎం.సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి క్రీడలు



మండల స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు తదితరులు



పాయకరావుపేటలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

ఎస్.రాయవరం: కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలను యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు ప్రారంభించారు. మొదటి రోజు బాలికలకు అండర్–14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో పోటీలు ఉత్సాహంగా సాగాయి.

పాయకరావుపేట మండల స్థాయి క్రీడా పోటీలకు 350 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు క్రీడల మండల కోఆర్డినేటర్ శ్యామ్ తెలిపారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. మండలంలోని 15 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు.

'జీఎస్టీ సవరణతో చేనేత కార్మికులకు మేలు'



కైలాసపట్నంలో చేనేత కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: జీఎస్టీ తగ్గింపుతో చేనేత కార్మికులకు మేలు కలగనుందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. కైలాసపట్నంలోని శ్రీరాజగోపాలస్వామి చేనేత సొసైటీని శుక్రవారం సందర్శించి జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు తమ సమస్యలను ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. స్థానికంగా 75 చేనేత కార్మిక కుటుంబాలు ఉన్నాయని, ప్రభుత్వ ప్రోత్సాహం లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్టు తెలిపారు. చేనేతకు తగిన ప్రోత్సాహం లేకపోవడంతో మగ్గాలు మూలకు చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది కార్మికులు పొట్టకూటి కోసం వేరే ప్రాంతాలకు వలస పోతున్నారన్నారు. స్పందించిన ఎంపీడీవో ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, కార్యదర్శులు రఘురాం, విజయలక్ష్మి, మహిళా పోలీసు లలిత, చేనేత కార్మికులు వంకల వెంకట అప్పారావు, సామాల నానాజీ, రాపర్తి సత్తిబాబు, గుంపిన చిన్న, గుంపిన శ్రీను, కుడకల అప్పారావు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు తెలిపారు. అజెండాలో 11 అంశాలను పొందుపర్చామని, దీనిని ఇప్పటికే సభ్యులకు పంపించినట్టు పేర్కొన్నారు. సభ్యులంతా ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పాయకరావుపేట: పోషణ మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు లలిత, రంజాన్ బేబీలు సామూహిక సీమంతం నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు కూడా ఎక్కువ పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి రమ్య

మునగపాక: బాల్య వివాహాలను నిరోధించాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి కేఎల్‌వీ రమ్య కోరారు. మండలంలోని మూలపేటలో శుక్రవారం బాలల సంరక్షణ కమిటీ ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిటీ సభ్యులు బాధ్యతగా పనిచేసి బాల్య వివాహాల కట్టడికి కృషి చేయాలన్నారు. బాలికలపై లైంగిక వేధింపులు లేకుండా చూడాలన్నారు. బాల కార్మికులతో ఎక్కడైనా పనులు చేయిస్తే చర్యలు తీసుకునేలా కమిటీ సభ్యులు వ్యవహరించాలన్నారు.
జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, కార్యదర్శి గంగాధర్, ఏఎన్ఎం భారతి, అంగన్‌వాడీ టీచర్ నాగమణి, మహిళా సంక్షేమ కార్యదర్శి శ్రీలత, వీవోఏ చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛపై దాడికి నిరసన



తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు

మునగపాక: పత్రికా స్వేచ్ఛకు తిలోదకాలిస్తూ కూటమి ప్రభుత్వం చేస్తున్న చర్యలు తగవంటూ పాత్రికేయులు శుక్రవారం మునగపాక రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డితో పాటు నెల్లూరు సాక్షి బ్యూరోపై అక్రమ కేసులు బనాయించడం తగదంటూ పాత్రికేయులు మండిపడ్డారు. అనకాపల్లి జిల్లా ఫెడరేషన్ అధ్యక్షుడు బి.వెంకటేశ్ మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను హరించాలని చూడడం అవివేకమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సాక్షి పాత్రికేయులపై కక్షసాధింపులు పెరిగాయని ఆరోపించారు. పత్రికల్లో ప్రభుత్వ వ్యతిరేక కథనాలు వస్తే అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు ఖండించాల్సి ఉన్నా కక్ష పూరితంగా సాక్షి కార్యాలయంపై పోలీసులతో దాడులు చేయించడం సరికాదన్నారు. ప్రభుత్వ తీరును ఇప్పటికైనా మార్చుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ పి.సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మునగపాక ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దాడి అరుణ్‌కుమార్, వెలగా జగదీష్ కుమార్, పాత్రికేయులు కొయిలాడ జగన్నాథరావు, శరగడం సీతారామ్, వాసు, కృష్ణ, కర్రి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: కోరం లేక శుక్రవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అనుమతితో సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో ఉషారాణి ప్రకటించారు. స్థానిక మండల పరిషత్ హాలులో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించేలా ఎంపీడీవో ఎం.ఉషారాణి చర్యలు తీసుకున్నారు. మండల స్థాయి అధికారులు అనుకున్న సమయానికి హాజరయ్యారు. అయితే సభ్యులు పూర్తి స్థాయిలో హాజరు కాలేదు. మండల వ్యాప్తంగా 16 మంది ఎంపీటీసీలకు మెలిపాక ఎంపీటీసీ సూరిశెట్టి వెంకటరావు మృతి చెందగా.. మిగిలిన 15 మంది సభ్యులకు శుక్రవారం జరిగిన సమావేశానికి ఎంపీపీతో పాటు ముగ్గురు జనసేన ఎంపీటీసీలు హాజరు కాగా మిగిలిన 11 మంది వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు సమావేశానికి గైర్హాజరయ్యారు. కొంత కాలంగా ఎంపీపీ జయలక్ష్మితో స్థానిక వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు విభేదిస్తూ వస్తున్నారు. ఎంపీపీ ఒంటెద్దు పోకడలతో పాటు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలకు సరైన గౌరవం ఇవ్వకపోవడంతోనే తాము ఈ సమావేశానికి హాజరు కాలేక పోయామంటూ సాక్షికి తెలిపారు. సమావేశం వాయిదాకు ముందు ఎంపీపీ జయలక్ష్మి మాట్లాడుతూ సభ్యులు రాకపోవడం వల్ల తనకు పోయిందేమీ లేదని, ప్రజలు ఇబ్బందులు పడతారంటూ చెప్పుకొచ్చారు.

రైతులకు బోనస్ పంపిణీ

మునగపాక: రైతులకు మెరుగైన సేవలందించేందుకు పాలక వర్గం కృషి చేస్తుందని పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి విల్లూరి నూక నరసింగరావు అన్నారు. మునగపాక పీఏసీఎస్ ఆవరణలో శుక్రవారం 3664 మంది రైతులకు రూ.4,79,231 నగదును బోనస్‌గా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంఘ సీఈవో పెంటకోట మహేష్, సభ్యులు అప్పలరాజు, పాలిపిని రాము, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాల మేరకు నేరుగా పరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

మునగపాక: హైకోర్టు ఆదేశాల మేరకు పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు పరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు కోరారు. టీడీఆర్ నోటిఫికేషన్ రద్దు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. మునగపాకలో శుక్రవారం రహదారి విస్తరణ బాధితులతో ఆయన మాట్లాడారు. పూడిమడక రోడ్డు విస్తరణకు సంబంధించి 2013 భూ చట్టం ప్రకారం పరిహారం అందించాలన్నారు. బాధితులకు పరిహారాన్ని నేరుగా అకౌంట్‌లో జమ చేయాలన్నారు. అంతేకాని టీడీఆర్ బాండ్లు ఇస్తామని చెప్పడం ప్రభుత్వానికి సరికాదన్నారు. రహదారి విస్తరణలో భాగంగా భూములు, ఇళ్ల స్థలాలు కోల్పోయే వారికి హైకోర్టు ఆదేశాల మేరకు పరిహారం ఇచ్చేలా చూడాలన్నారు. వీఎంఆర్‌డీఏ ఇచ్చిన నోటిఫికేషన్‌ను తిరస్కరిస్తూ ఈ నెల 14న హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, నిర్వాసితుల సంఘ కన్వీనర్ ఆర్.రాము, కో–కన్వీనర్ కె.సదాశివరావు, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, బ్రహ్మాజీ, ఆళ్ల మహేశ్వరరావు, రాము, టెక్కలి జగ్గారావు, కూండ్రపు సోమునాయుడు, ఎంవీఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి

- వైఎస్సార్‌సీపీ యలమంచిలి సమన్వయకర్త ధర్మశ్రీ
- రాంబిల్లి మండలంలో కోటి సంతకాల సేకరణ



కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

రాంబిల్లి(అచ్యుతాపురం): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రజలు ముందుకు రావాలని వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. రాంబిల్లి మండలంలోని గోకివాడ, మూల కొత్తూరు, మూల జంప, హరిపురం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల అభిప్రాయాలను గవర్నర్‌కు తెలిపేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వైద్యానికి ఎంతో ప్రాముఖ్యత ఉందో అందరికీ తెలుసని, పేద, బలహీన వర్గాలకు చెందిన వారికి ఉచితంగా సేవలందించే మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. తద్వారా మెడికల్ సీట్లు సైతం రాష్ట్ర విద్యార్థులకు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ధూళి నాగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పిన్నమరాజు కిశోర్, మండల ప్రచార కార్యదర్శి కొవిరి రామకృష్ణ, నీరుకొండ వెంకట సూర్యనారాయణ, ధూళి రమణ, ధూళి బుజ్జి, వేగి అచ్చింనాయుడు, నెట్టం సత్యనారాయణ, ధూళి వెంకి, ధూళి సూర్యచంద్ర, వియ్యపు చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు పిలుపునిచ్చారు.



తోటాడలో కోటి సంతకాల సేకరణ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం మండలంలోని తోటాడలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు కుట్రలు చేయడం విచారకరమన్నారు. పార్టీ శ్రేణులు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు దొడ్డి బాలాజీ, పాలమరశెట్టి జగదీష్, బొడ్డేడ లిల్లీ, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.